www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

రూ. 200 కోట్లతో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



3 లో..



హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 242, శుక్రవారం 2-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి

సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం

దిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ

స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని



న్యూఢిల్లీ, అక్టోబర్ 2 :

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేదుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్మృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.



ఇచ్చిన హామీలు పక్కనపెట్టి

కొత్త వివాదాలు

శివుడు, శ్రీరాముడిని వేరు చేసి వ్యాఖ్యలా?

దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

సీఎం రేవంత్? వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

హైదరాబాద్, అక్టోబర్ 2 :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త

రెండు డీఏలు మంజూరు

ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త

ఏడాదికి రెండున్నర వేలకోట్ల అదనపు భారం

ఒక డీఏ రాబోయే జీతాలతో కలిపి పంపిణీ

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

ఎల్?నినో పరిస్థితులపై భేటీలో సుదీర్ఘ చర్చ

కరవు పరిస్థితులపై చర్యలకు సమాలోచనలు

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లపై పలు సూచనలు

ప్రాజెక్టులపై పునస్సమీక్షించాలని నిర్ణయం

10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేత

డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు న్యూ పాలసీ



హైదరాబాద్, అక్టోబర్ 2 :

తెలంగాణలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులతో ఇటీవల జరిపిన చర్చల అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్రంలో ఉద్యోగులకు, పింఛనుదారులకు నిలిచిపోయిన పెండింగ్ కరువు భత్యాల్లో రెండు విడతల డీఏల విడుదలకు కేబినెట్ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు , రిటైర్డ్ పెన్షనర్లకు వేతనాల పరంగా పెద్ద ఊరట లభించనుంది.కేబినెట్ నిర్ణయాల ప్రకారం.. ఉద్యోగులకు 3.64 శాతం , 2.74 శాతం చొప్పున మొత్తం రెండు డీఏలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఒక డీఏను త్వరలోనే రాబోయే జీతాలతో కలిపి పంపిణీ చేయనుండగా, మరో డీఏను రాబోయే పండుగలు, తదుపరి షెడ్యూల్ ప్రకారం విడుదల చేయనున్నారు. అంతేకాకుండా, ఉద్యోగులు , పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ. 10,000 కోట్ల పాత జిపిఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ బిల్లుల బకాయిలను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తూ రాబోయే కాలంలో పూర్తిగా చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన కార్యాచరణకు అంగీకారం తెలిపింది. డీఏల విడుదలతో పాటు పే రివిజన్ కమిషన్ నివేదిక అమలుపై కూడా కేబినెట్ భేటీలో విస్తృతంగా చర్చించారు. పీఆర్సీ కమిటీ అందించే తుది నివేదికను పరిశీలించి, వీలైనంత త్వరగా కొత్త వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాల విన్నపాలను సానుకూలంగా పరిశీలించి ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల అంశాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ధరణి పోర్టల్ స్థానంలో తీసుకురానున్న కొత్త భూపరిపాలన వ్యవస్థ, నిషేధిత భూముల జాబితా సమీక్ష , రైతులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాల అమలుపై సభలో చర్చ జరిగింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ నిధుల మంజూరుకు మంత్రివర్గం అమోదముద్ర వేసింది. గురువారం నాటి కేబినెట్ సమావేశం బహుళ ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలతో ముగిసింది. దసరా, దీపావళి పండుగల వేళ విడుదలైన రెండు డీఏల నిర్ణయం ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ నిర్ణయానికి సంబంధించిన పూర్తి వివరాలు, చెల్లింపుల షెడ్యూల్ , అర్హతలతో కూడిన అధికారిక జీవోలు ఆర్థిక శాఖ ద్వారా త్వరలోనే వెలువడనున్నాయి. ఎల్ నినోను ఎదుర్కోవడంపై కేబినెట్ లో చర్చించారు. సబ్ కమిటీని

..మిగతా 2లో

ఖైరతాబాద్ ఉపఎన్నిక... నోటిఫికేషన్ ఆపండి

హైకోర్టుకు విజయారెడ్డి.. విచారణ వాయిదా

హైదరాబాద్, అక్టోబర్ 2 :

ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి కుమార్తె విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల



అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

92 లక్షల మందికి నోటీసులు

తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్

65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్న సుదర్శన్ రెడ్డి

సర్ ప్రక్రియను పాడిగించే ఉద్దేశం లేదని స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 2:

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది



నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
శుక్రవారం
2 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో దాండియా, బతుకమ్మ వేడుకలు

ఉమ్మడి కరీంనగర్ అక్టోబర్, 01:

అల్ఫోర్స్" విద్యాసంస్థల అధినేత , విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి సతీమణి డాక్టర్ వి. వనజా నరేందర్ రెడ్డి తో కలిసి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్,ఇ-టెక్నో స్కూల్ మైదానంలో బతుకమ్మ మరియు దాండియా వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మను పూజించినట్లయితే ప్రకృతిని కొలిచినట్లే అని వారు అభిప్రాయపడ్డారు.సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ ,దాండియా అని మరియు బతుకమ్మను రాష్ట్ర పండుగగా పరిగణించడం జరిగిందని ఈ పండుగ చాలా ఉత్సాహవంతమైనదని పల్లెల్లో ఈ పండుగకు నేటికీ తరగని వైభవం ఉన్నదని ప్రధానంగా వారు పాడే బతుకమ్మ పాటలు మరియు చేసే కోలాట విధానం, తెలంగాణ ప్రజల జీవన ప్రతిబింబం. రంగురంగుల స్థానిక పూలతో బతుకమ్మను అందంగా పేర్చుతారని, మహిళలు సాంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మను ఆడుకుంటారని వారు చెప్పారు. అల్ఫోర్స్





విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆనందోత్సవాల నడుమ ఈ వేడుకలు నిర్వహించుకోవడం జరిగింది., ఈ వేడుకల సందర్భంగా చాలా ఆకర్షణీయమైన బతుకమ్మలను వివిధ అంశాల మీద ఏర్పాటు చేశారు. వివిధ ఆకర్షణనీయమైనా పాటలపై దాండియా చేశారు.తల్లిదండ్రుల సైతం చక్కటి కోలాటంతో వేడుకలకు వన్నె తెచ్చారు.విద్యుత్ కాంతుల నడుమ తెలంగాణ రాష్ట్ర పండుగను చాలా వైభవంగా నిర్వహించడం చాలా గొప్ప విషయమని తల్లిదండ్రులు కొనియాడారువేడుకలు లో భాగంగా విద్యార్థుల ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకాశంలో ఆశల హరివిల్లు, రమణి బిందాల, ఓరుగల్లు పిల్ల, కమ్మని నీ ప్రేమలేఖలే, జాముురాత్రి, అందమైన ప్రేమ రాణి, మాటేరాని చిన్నదాని తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో వివిధ అల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు



జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా
రాందేవ్ రావు ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

రక్తదానం సామాజిక బాధ్యత...మరొకరి ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా సేవ

విద్యార్థి నాయకుడు అశ్వంత్ కుమార్

కూకట్‌పల్లి, అక్టోబర్ 1:

జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాందేవ్ రావు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థి నాయకుడు అశ్వంత్ కుమార్ పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఒక నిండు ప్రాణాన్ని కాపాడి, వారికి పునర్జన్మ ప్రసాదించినట్లవుతుందని పేర్కొన్నారు. రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందక ప్రాణాపాయ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని, అలాంటి విపత్కర పరిస్థితుల్లో స్వచ్ఛంద రక్తదాతలు అందించే రక్తం ఎంతో విలువైనదని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ఆరోగ్యంగా ఉన్నవారు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించుకుని, మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని కోరారు. రక్తదానం అనేది కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా, మరొకరి ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా సేవ అని ఆయన అభిప్రాయపడ్డారు. యువత రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజంలో సేవాభావాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ రక్తదాన శిబిరంలో అఖిల్, లక్ష్మీ ప్రసాద్, రాధాకృష్ణ, సందీప్, రాకేష్, భరత్, అనిల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల్లో
కొలనూరు విద్యార్థుల ప్రతిభ

ఉమ్మడి కరీంనగర్ ,పెద్దపల్లి,అక్టోబర్, 01:

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల్లో తమ ప్రతిభను చాటారు. సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీల్లో విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించారు. దీంతో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా స్థాయి పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో రేండ్ల సౌమ్యశ్రీ డిస్కస్ త్రోలో బంగారు పతకం, జావెలిన్ త్రో లో రజిత పతకం,షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించి ప్రతిభ కనబరిచింది. అదేవిధంగా అండర్-17 బాలుర విభాగంలో ఉప్పుల శ్రీవిష్ణు వాలీబాల్ లో రజత పతకం సాధించాడు.అండర్-17 బాలుర విభాగంలో గండికోట రామ్ చరణ్ జావెలిన్ త్రో లో రజిత పతకం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిట్టూరి యేసుదాసు, గ్రామ సర్పంచ్ పల్లె కనకయ్య, ఉపసర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి అభినందించారు. జిల్లా స్థాయిలో కూడా విద్యార్థులు ఇదే స్ఫూర్తితో రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించి, వారి ప్రతిభను వెలికితీసిన వ్యాయామ ఉపాధ్యాయులు పీ సదయ్యను అభినందించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్ తో కలిసి పాల్గొన్న పట్వారీ శశిధర్

కూకట్ పల్లి, అక్టోబర్ 1 :

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అనారోగ్య కారణంగా చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి" వి. జగదీశ్వర్ గౌడ్ నల్లగండ్ల లోని వారి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించినవారికి నియోజకవర్గంలోని 25 మందికి రూ.14,95,000/- మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఆపద సమయంలో, బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి



నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ సహాయ నిధి సకాలంలో మద్దతు అందించడం ద్వారా కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా కాపాడుతుందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కి, ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్, నాయకులు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సత్తూర్ శిరీష, డివిజన్ నాయకులు, మహిళ నాయకులు, లేబర్ సెల్ నాయకులు, సేవాదళ్ నాయకులు, యువకులు, లభిదారులు, ప్రజలు, టీం పట్వారి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 6 నెలల్లో 25.66 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

ఉమ్మడి కరీంనగర్ ,గోదావరిఖని అక్టోబర్, 01:

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి సాధించడంలో వెనుకబడుతోంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ముగిసిన మొదటి ఆరు నెలల్లో కేవలం 25.66 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని భావిస్తున్న సింగరేణికి ఈసారి కూడా ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి ఆరు నెలల్లో కేవలం 25.66 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగడంతో రానున్న ఆరు నెలల్లో 39.34 మిలియన్ టన్నుల భారీ బొగ్గు ఉత్పత్తి సాధించాల్సిన అవసరం ఏర్పడింది. మొదటి ఆరు నెలల్లో నెలకు సరాసరిగా కేవలం నాలుగు మిలియన్ టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి జరిగితే వచ్చే ఆరు నెలల్లో నెలకు సరాసరిగా 6.6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. సెప్టెంబర్ నెలలో 4126824 ట న్నుల లక్ష్యానికి గాను 4484890 టన్నులు (109%) సాధించి కొంత ఉరట కల్పించినప్పటికీ... రానున్న రోజుల్లో భారీ బొగ్గు ఉత్పత్తి సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది మొదటి ఆరు నెలలతో పోలిస్తే ఈ ఏడాది ఆరు నెలల్లో 2.22 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకబడి ఉండడం సింగరేణి ఆందోళన చెందడానికి కారణం అవుతుంది.ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు గడిచిన ఆరు నెలల్లో కొత్తగూడెంలో 526000 టన్నుల లక్ష్యాన్ని గాను 267655 టన్నులు(51 శాతం) ఎస్సీఎల్ లో 5816000 టన్నులకు గాను 7776992 టన్నులు (134%) ఇల్లందులో 1373000 తన్నులకు గాను 910136 టన్నులు (66%) మణుగూరులో 4468000 ట న్నులకు గాను 6175526 టన్నులు (138%) బెల్లంపల్లిలో 1400000 కు గాను 1553136 (111%) మందమర్రిలో 1171500 కు గాను 848496 (72%) శ్రీరాంపూర్ లో 2731500 కు గాను 1210046



(44%) రామగుండం-1 లో 1887400 గాను 1190797 (63%) రామగుండం-2లో 3926300 కు గాను 3985000 (101%) రామగుండం-3లో 1575000 కు గాను 1025719 (65%) అడ్రియాలలో 160300 కు గాను 40226 (31%) భూపాలపల్లిలో 1833200 కు గాను 672954 (37%) సాధ్యమైంది.మొత్తం సింగరేణిలో 26868200 టన్నులకు గాను 25665083 (96%) సాధించింది. గత ఏడాది మొదటి ఆరు నెలల్లో 27890914 టన్నులు సాధిస్తే ఈసారి 25665083 కి తగ్గి 2225831 టన్నులు వెనుకబడి ఉంది. వచ్చే ఆరు నెలల్లో ప్రతిరోజు రెండు లక్షల ఇరవై వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధ్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిర్దేశిత లక్ష్యాలు సాధ్యం కాకుంటే లాభాలపై తీవ్ర ప్రభావం పడుతుందని దీని ద్వారా సింగరేణి ఇబ్బందులు ఎదుర్కొంటుందని భావిస్తున్నారు.



చట్ట ఉల్లంఘనలు బాధ్యత వహిస్తూ కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలి

వామపక్షాల డిమాండ్

ఉమ్మడి కరీంనగర్ , జగిత్యాల :

చట్ట ఉల్లంఘనలు బాధ్యత వహిస్తూ కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలోని వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలు భారత ఎన్నికల కమిషన్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు, ఓటర్ల నమోదు ప్రక్రియలో ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యలను తీవ్రంగా ఖండిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని అన్నారు. దేశవ్యాప్తంగా తొలగించిన 13 కోట్ల ఓటర్లను పునరుద్ధరించాలని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను ఉపసంహరించాలని కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజాగౌడ్‌కి వినతిపత్రం అందజేశారు.ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, ఓటర్ల జాబితా నుండి చేసిన అన్ని తొలగింపులను పారదర్శకంగా, సరిచూసుకోదగిన విధంగా సమీక్షించాలని, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించినట్లయితే, సరైన ప్రక్రియను అనుసరించి, వారికి వివరణ ఇచ్చుకునే అవకాశం కల్పించిన తర్వాత వారి పేర్లను తిరిగి చేర్చాలన్నారు. రాజ్యాంగం, చట్టం, భారత సుప్రీంకోర్టు ఆదేశాలకు కచ్చితంగా కట్టుబడి మాత్రమే ఎన్నికల కమిషన్ కూర్పు, పనితీరును పునర్వ్యవస్థీకరించాలని, ఈ అంశాలను అత్యంత తీవ్రంగా పరిగణించి, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, బాధ్యతాయుత వాతావరణం, ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్నిల కమిషన్‌ను కోరుతున్నామన్నారు. ఈ వినతిపత్రాన్ని భారత ఎన్నికల కమిషన్‌కు పంపి, మీ పరిధిలోని తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, కార్యవర్గ సభ్యులు ఎండీ ముఖ్రం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చింత భూమేశ్వర్, ప్రజా సంఘాల నాయకులు గుడిసెల విజయ్, గుండాలపు ధర్మయ్య తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.



వేద సంస్కృతి పరిరక్షణలో
బ్రాహ్మణుల పాత్ర కీలకం

చతుర్వేద సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు, అక్టోబర్ 1:

తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్తక సభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ భవనంలో నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు--10వ చతుర్వేద సదస్సులో భాగంగా బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వేద శాస్త్ర పండితులు, బ్రాహ్మణోత్తముల సమక్షంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని, వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, వేద సంప్రదాయాలను తరతరాలకు అందించడంలో బ్రాహ్మణ సమాజం విశిష్టమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. వేదాలు, శాస్త్రాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షిస్తూ సమాజానికి మార్గనిర్దేశం చేస్తున్న వేద పండితుల సేవలు ఎంతో గౌరవనీయమైనవని పేర్కొన్నారు. సమాజంలో నైతిక విలువలు, ఆధ్యాత్మిక చైతన్యం, సాంస్కృతిక వారసత్వం మరింత బలోపేతం కావాలంటే వేద సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వేదాలు కేవలం ఆధ్యాత్మిక జ్ఞానానికి మాత్రమే కాకుండా, మానవతా విలువలు, క్రమశిక్షణ, సమాజ శ్రేయస్సుకు మార్గదర్శకాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.గతంలోనూ ఈ సమావేశాలకు తాము ఆతిథ్యం ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పటాన్ చెరు నియోజకవర్గంలో బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వేద బ్రాహ్మణులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు సొంత నిధులను సైతం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చతుర్వేద సదస్సు వంటి కార్యక్రమాలు వేద సంప్రదాయాలను యువతకు చేరువ చేయడంతో పాటు, మన ప్రాచీన జ్ఞాన సంపదపై అవగాహనపెంపొందించేందుకు దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వాసుదేవరావు, రామచంద్రాపురం మండల కార్యదర్శి చంద్రశేఖర్ జోషి, సంగారెడ్డి జిల్లా సభ్యులు వామనభట్ల ప్రకాశ శర్మ తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్ధక సభ్యులు, వేద పండితులు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రతినిధులు, నిర్వాహకులు, భక్తులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త

మొదటి పేజీ తరువాయి...

నియమించనున్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టును మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలను సమన్వయం చేసేందుకు నలుగురు గ్రూప్-1 అధికారులను నియమించేందుకు ఆమోదం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా సంస్థలకు సంబంధించి ప్రత్యేక ప్రకటన విధానాన్ని తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విధానానికి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీ రూపొందించనున్నారు. ఈ విధానం ద్వారా డిజిటల్ మీడియాకు ప్రభుత్వ ప్రకటనల జారీకి ప్రత్యేక మార్గదర్శకాలు ఏర్పడే అవకాశం ఉంది.

హాస్టళ్లలో నిర్లక్ష్యం సహించేది లేదు

- విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్ దివాకర టీఎస్

- వార్డెన్ హాస్టల్‌లోనే ఉంటే 90 శాతం సమస్యలు పరిష్కారం.. అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 1(భద్రాద్రిన్యూస్):
రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను హెచ్చరించారు. విద్య, వసతి, భోజనం, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత శాఖల అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులతో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజనం, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

వార్డెన్ హాస్టల్‌లో ఉంటే 90 శాతం సమస్యలు పరిష్కారం
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హాస్టళ్లను సీనియర్ అధికారులు తరచూ తనిఖీ చేస్తున్నప్పటికీ, వార్డెన్లు స్థానికంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షించడం అత్యంత కీలకమన్నారు. వార్డెన్ హాస్టల్‌లోనే ఉండేలా చర్యలు తీసుకుంటే 90 శాతం సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. వచ్చే వారం నుంచి రెసిడెన్షియల్ విద్యాసంస్థలను అర్ధరాత్రి, తెల్లవారుజామున వంటి అనూహ్య సమయాల్లో ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు. తనిఖీల సమయంలో వార్డెన్ విధుల్లో లేకపోతే సస్పెన్షన్‌కు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యార్థులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తే కఠిన చర్యలు
హాస్టళ్లలో పారిశుద్ధ్య పనులను సంబంధిత సిబ్బందే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులతో హాస్టల్ శుభ్రం చేయించడం వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. హాస్టళ్ల పరిసరాల్లోని పొదలు, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఫుడ్ పాయిజనింగ్, పాము కాట్లకు అడ్డుకట్ట
నాణ్యత లేని ముడిసరుకులు, వంటశాలలు--పాత్రల అపరిశుభ్రత, ఆహారం కలుషితం కావడం వంటి కారణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. స్టోర్ ఇన్‌చార్జిలు సరుకులను స్వీకరించే ముందు నాణ్యతను పరిశీలించాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని సరుకులను తిరస్కరించాలని ఆదేశించారు. హాస్టళ్లలో పాము, ఎలుక కాట్లకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని, అవసరమైన చోట ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. నిధులు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

కాంపౌండ్ వాల్ లేని హాస్టళ్లకు ప్రతిపాదనలు
కాంపౌండ్ వాల్ లేని హాస్టళ్ల వివరాలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వ సంస్థల కేటగిరీలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉన్న భవనాలను గుర్తించి వెంటనే సాంకేతిక సవరణలు





చేపట్టాలని ఆదేశించారు.

లైంగిక వేధింపులపై జీరో టాలరెన్స్
రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో లైంగిక వేధింపుల ఘటనలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి ఘటననూ దాచిపెట్టకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితిపై పర్యవేక్షణ
విద్యార్థుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే ఏఎన్ఎం వెంటనే స్పందించి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులను గుర్తించి అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని, వారితో అధికారులు, వార్డెన్లు క్రమం తప్పకుండా మాట్లాడాలని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డైట్, కాస్మోటిక్, అద్దె, విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాల వివరాలను టోకెన్ నంబర్లతో సహా సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల యూనిఫాం సరఫరా, పెండింగ్ వివరాలను సంస్థల వారీగా అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మంజూరైన టాయిలెట్లు, ఇతర అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
సమావేశంలో జిల్లా ఎస్సీ, బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ముజాహిద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి, ఆర్‌సీవోలు, హాస్టల్ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో రేజోనెన్స్ విద్యార్థుల సత్తా

- అండర్--14, అండర్--17 విభాగాల్లో పలువురు విద్యార్థుల ఎంపిక

- కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన రేజోనెన్స్ విద్యార్థులు



ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 1 (భద్రాద్రిన్యూస్): తెలంగాణ ఖమ్మం అర్బన్ సౌత్ మండల పరిధిలోని 70వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో శ్రీనివాసనగర్ రేజోనెన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి తదుపరి స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 29న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో అండర్--17 కబడ్డీ విభాగంలో పవన్ కుమార్, అండర్--17 వాలీబాల్ విభాగంలో కృష్ణ చైతన్య, ప్రశాంత్, శ్రావణ్ కుమార్ ఎంపికయ్యారు. అలాగే అండర్--14 వాలీబాల్ విభాగంలో కృష్ణ ప్రసాద్, జ్ఞానేశ్వర్ ప్రతిభ కనబరిచి ఎంపిక సాధించారు.విద్యార్థుల విజయంపై పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, నీలిమా మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి నిరంతరం ప్రోత్సాహం అందిస్తూ మరిన్ని విజయాలు సాధించేలా శిక్షణ, సహకారం అందిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

గాంధీ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకం: మాజీ ఎంపీ నామ

- సత్యం, అహింస, శాంతి విలువలను ఆచరించాలి : మాజీ ఎంపీ నామ

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 1 (భద్రాద్రిన్యూస్) :- మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని నామ గుర్తుచేశారు. అహింస, సత్యాగ్రహం, సహనం వంటి ఆయుధాలతో ప్రజలను ఏకం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహోద్యమాన్ని నడిపించిన మహనీయుడని పేర్కొన్నారు. గాంధీజీ జీవితం, ఆయన ఆలోచనా విధానం ప్రతి తరానికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలని గాంధీజీ ఆకాంక్షించారని నామ ప్రస్తావించారు. గ్రామీణ భారతం అభివృద్ధి చెందితేనే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందనే గాంధీజీ ఆలోచనలను గుర్తుచేశారు. గ్రామ స్వరాజ్యం, స్వావలంబన, సామాజిక సమానత్వం వంటి ఆయన ఆశయాలు నేటికీ ప్రాధాన్యత కలిగి ఉన్నాయని వివరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ శాంతియుత ప్రజాస్వామ్య పోరాటం ద్వారా రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘంగా పోరాడారని నామ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు తీసుకెళ్లి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. కేసీఆర్ పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని నామ గుర్తుచేశారు. పల్లె ప్రగతి, గ్రామ పంచాయతీల బలోపేతం, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం వంటి చర్యల ద్వారా



గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించారని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం గాంధీజీ గ్రామ స్వరాజ్య ఆలోచనలకు అనుగుణంగా ఉందని తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ, గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని నామ కోరారు.

భద్రాద్రి నుంచి తిరుమలకు త్రివేణి డైరెక్టర్ మహా పాదయాత్ర

- డా. వీరేంద్ర చౌదరికి త్రివేణి ఉపాధ్యాయులు, స్టూడెంట్ కౌన్సిల్ సంఘీభావం

- 8వ రామన్న--వెంకన్న పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్ష



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 1(భద్రాద్రిన్యూస్): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్యక్షేత్రం నుంచి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధి వరకు నిర్వహిస్తున్న 8వ రామన్న--వెంకన్న మహా పాదయాత్రలో పాల్గొంటున్న త్రివేణి పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, పాదయాత్ర బృంద సభ్యులకు ఖమ్మం త్రివేణి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో భద్రాద్రి నుంచి తిరుమల వరకు కొనసాగుతున్న మహా పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులు డా. వీరేంద్ర చౌదరి, పాదయాత్ర బృంద సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. డా. వీరేంద్ర చౌదరి నేతృత్వంలో కొనసాగుతున్న 8వ రామన్న--వెంకన్న మహా పాదయాత్ర దిగ్విజయంగా పూర్తికావాలని, పాదయాత్ర ద్వారా చేపడుతున్న ఆధ్యాత్మిక, సేవా సంకల్పాలు విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం బ్రాంచ్ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు, హెడ్ బాయ్, వివిధ హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, విద్యార్థులు పాల్గొని పాదయాత్ర బృందానికి "ఆల్ ది బెస్ట్" అంటూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

రూ. 200 కోట్లతో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి

- ఏదులాపురం మున్సిపాలిటీలో టీజీఎన్ పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవనం ప్రారంభోత్సవం

- గృహజ్యోతి లబ్ధిదారులకు రూ. 40.19 కోట్ల సబ్సిడీ వర్తించినట్లు వెల్లడి





పాలేరు, అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్):
పాలేరు నియోజకవర్గంలో, ప్రత్యేకంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి రూ. 205 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తరుణీ హట్ ప్రాంగణంలో టి జి ఎన్ పి డి సి ఎల్ డివిజన్ కార్యాలయం, విద్యుత్తు రెవెన్యూ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు.
గృహ జ్యోతి లబ్ధిదారులకు రూ. 40.19 కోట్ల సబ్సిడీ
వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా కొరకు 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ ఫీడర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండేళ్లలో 632 విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయించామని, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో నాలుగు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. పాలేరు నియోజకవర్గంలో గత రెండేళ్లలో గృహ జ్యోతి లబ్ధిదారులకు రూ. 40.19 కోట్ల సబ్సిడీ వర్తించినట్లు తెలిపారు. మోడల్ సోలార్ గ్రామం పథకం లో భాగంగా.. నేలకొండపల్లిలోని చెరువు మాదారంలో 1,350 మంది గృహ వినియోగదారులకు రూ. 15.66 కోట్ల వ్యయంతో 2,709 కే డబ్ల్యూ సామర్థ్యంతో సౌర విద్యుత్ పలకల పనులు పురోగతిలో ఉన్నాయని, అలాగే రైతుల కోసం రూ. 31.08 కోట్లతో సౌర విద్యుత్ సౌకర్య పనులు చేపట్టినట్లు తెలిపారు. అత్యవసర విద్యుత్ పునరుద్ధరణ కోసం విద్యుత్ అంబులెన్స్(ఈఆర్టీ వాహనం)ను అందుబాటులోకి తెచ్చామని వివరించారు.
ఈ కార్యక్రమంలో..: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, టీజీఎన్ పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ రావు, ఏదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ శ్రీనివాస చారి, డీఈ నాగేశ్వరరావు, కాంగ్రెస్ ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

- సత్యం, అహింస, క్రమశిక్షణ, దేశభక్తి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలి

- గాంధీ, శాస్త్రి ఆశయాలను ఆచరించడమే వారికి ఘనమైన నివాళి: పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి

ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 2 (భద్రాద్రిన్యూస్):
త్రివేణి పాఠశాలలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ..



మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు, వారి జీవితాల్లోని సత్యం, అహింస, క్రమశిక్షణ, నిరాడంబరత, దేశభక్తి వంటి మహోన్నత విలువలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. దేశం కోసం వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారి ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని అన్నారు. దేశ అభివృద్ధిలో యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరించారు. లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు, ఆయన స్ఫూర్తిదాయకమైన జీవన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గాంధీజీ, శాస్త్రిజీతో పాటు పలువురు దేశభక్తుల వేషధారణలో పాల్గొని వారి జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థుల ప్రసంగాలు, దేశభక్తి గీతాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, బాలాజీ, క్యాంపస్ ఇన్‌చార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని హరిణి హత్య కేసులో నిందితుడు అరెస్ట్

- బైక్, రెండు మొబైల్ ఫోన్లు, వైర్, షర్ట్



జూలూరుపాడు/చండ్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:
మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని హరిణి (18) మృతి కేసులో నిందితుడిని జూలూరుపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 22న మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల ప్రాంతంలో హరిణి ఇంటి వద్ద మృతి చెంది ఉండగా, ఆమె తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 155/2026 కింద తొలుత దీహీూా సెక్షన్ 194 ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలో హరిణి మెడకు వైర్ బిగించి హత్య చేసినట్లు నిర్ధారణ కావడంతో కేసును దీహీూా సెక్షన్ 103(1) కింద హత్య కేసుగా మార్చారు.ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న దేవరకొండ పవన్‌కుమార్ (22), తండ్రి రాంబాబు, హమాలీ, వెంగన్నపాలెం ఎస్సీ కాలనీ, జూలూరుపాడు మండలం అప్పటి నుంచి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి ఆచూకీపై విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు అతడిని సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నేరం అనంతరం నిందితుడు ఉపయోగించినట్లు చెబుతున్న గ్లామర్ బైక్ (ూ28+9583)ను ఎవరికీ కనిపించని ప్రదేశంలో దాచినట్లు, అనంతరం ఆ బైక్‌ను తీసుకుని వెళ్లి పని చేసుకుంటూ జీవించేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి ఒక బైక్, రెండు మొబైల్ ఫోన్లు (ఒకటి మృతురాలిదిగా, మరొకటి నిందితుడిదిగా), బైక్ గేర్ వైర్, నిందితుడి షర్ట్ తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily

Follow :
@bhadradrinews

శుక్రవారం
2 । అక్టోబర్ । 2026

www.bhadradrinews.com
epaper.bhadradrinews.com

ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

పట్టభద్రుల ఓటరు నమోదుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

- ఫారం--18 ద్వారా నమోదు చేసుకోవాలని గుడిపూడి తిరుమలరావు

కారేపల్లి, (భద్రాద్రి న్యూస్ రాములు): పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత ఉన్న పట్టభద్రులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపూడి తిరుమలరావు సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఎన్నికల సంఘం సూచించిన ఫారం--18 ద్వారా తమ పేర్లను సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పట్టభద్రుల నియోజకవర్గంలో నమోదు కోసం నిర్దేశిత అర్హతలు కలిగి ఉండటంతో పాటు, సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులుగా ఉండాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి.
దరఖాస్తు సమయంలో పేరు, చిరునామా, విద్యార్హత తదితర వివరాలను స్పష్టంగా నమోదు చేసి, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు పంపించే ముందు నమోదు చేసిన వివరాలను మరోసారి పరిశీలించుకోవాలని సూచించారు. దరఖాస్తు పూర్తయిన అనంతరం అందే గుర్తింపు సంఖ్యను భద్రపరుచుకుని, దరఖాస్తు పరిస్థితిని పరిశీలించుకోవాలని కోరారు. పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా అర్హులైన పట్టభద్రులు శాసనమండలి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని గుడిపూడి తిరుమలరావు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.



ఖమ్మం మూడు పోలీస్ స్టేషన్లకు నూతన ఎస్‌హెచ్‌ఓలు

- ఖమ్మం టూ టౌన్, అర్బన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు



ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 1(భద్రాద్రిన్యూస్): ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టూ టౌన్, ఖమ్మం అర్బన్, ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. జె. రామకృష్ణ, ఎం. నాగరాజు, కె. శివప్రసాద్ నూతన ఎస్‌హెచ్‌ఓలుగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఎస్‌హెచ్‌ఓలు ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన ఎస్‌హెచ్‌ఓలకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.

బోర్‌వెల్ రీఛార్జ్ పనులతో భూగర్భ జలాల పెంపు

- ఎంపీడీఓ పద్మ, సర్పంచ్ బానోత్ హీరాలాల్



కారేపల్లి, భద్రాద్రి న్యూస్ రాములు): వీబీజీ రామ్‌జీ కార్యక్రమం ద్వారా భాగ్యనగర్ తండాలో చేపడుతున్న బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ పనులను సింగరేణి మండల ఎంపీడీఓ పద్మ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీఛార్జ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పద్మ మాట్లాడుతూ.. వర్షపు నీటిని వృథాగా పోకుండా బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ల ద్వారా భూమిలోకి మళ్లించడం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. భవిష్యత్‌లో నీటి నిల్వలు పెరిగి, గ్రామాల్లో నీటి కొరతను అధిగమించేందుకు ఈ పనులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ఇలాంటి నిర్మాణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. వీబీజీ రామ్‌జీ కార్యక్రమం కింద చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామంలో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, ఈసీ సుధీర్, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, వార్డు సభ్యుడు గాంధీ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు బాబు, పంచాయతీ సిబ్బంది రాందాస్, గణేష్, నంద, రాధా, హేంచంద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలంపల్లి తండాలో రహదారి శుభ్రతకు చర్యలు

సర్పంచ్ హేమలత బాలాజీ నాయక్, వార్డు సభ్యుడు లావుడియా రమేష్‌కు గ్రామస్తుల అభినందనలు



కారేపల్లి,(భద్రాద్రి న్యూస్ రాములు): పోలంపల్లి తండా గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్న సర్పంచ్ హేమలత బాలాజీ నాయక్ దంపతులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. పోలంపల్లి తండాలోని ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రహదారి ఇరువైపులా పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు విపరీతంగా పెరిగి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. ముఖ్యంగా ఈ రహదారి ద్వారా రైతులు, యువకులు, గ్రామ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో సమస్యను గుర్తించిన సర్పంచ్ వెంటనే స్పందించారు. సర్పంచ్ హేమలత బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో రెండో వార్డు సభ్యుడు లావుడియా రమేష్ సహకారంతో రహదారి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల పొదలను తొలగించి శుభ్రం చేయించారు. దీంతో రహదారి విశాలంగా మారడంతో పాటు ప్రజలు, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడింది. ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే స్పందించి పరిష్కరించడం పట్ల పోలంపల్లి తండా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధితో పాటు రహదారుల పరిశుభ్రత, పారిశుధ్యంపై సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ముందుండి పనిచేస్తున్న సర్పంచ్ హేమలత బాలాజీ నాయక్ దంపతులకు, రెండో వార్డు సభ్యుడు లావుడియా రమేష్‌కు గ్రామ పెద్దలు, యువకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తూ పోలంపల్లి తండాను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

పోషణ మాసంలో వేడుకగా శ్రీమంతాలు.. అన్నప్రాసన

- గర్భిణులు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం

- 11 మంది గర్భిణులకు శ్రీమంతాలు.. ఆరుగురు చిన్నారులకు అన్నప్రాసన



ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 1 (భద్రాద్రిన్యూస్): పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఖమ్మం రూరల్ మండల స్థాయి కార్యక్రమాన్ని గురువారం రెడ్డిపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, ఆరు నెలల వయస్సు కలిగిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రోటీన్లు, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో 11 మంది గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, ఆరు నెలలు నిండిన ఆరుగురు చిన్నారులకు అన్నప్రాసన వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంబూరి దయాకర్‌రెడ్డి, 1వ డివిజన్ కౌన్సిలర్ రవీంద్ర, సీడీపీఓ కమలాప్రియ, ఎన్.వి.పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు మాలతి, పుష్పలత, నీరజ, శకుంతల, డాక్టర్ అంజమ్మ, గోవిందమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

సేవాస్ఫూర్తి మరువలేనిది. ఎంజా సమ్మయ్యకు ఘన నివాళి

- దశదిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సహచర ఉద్యోగులు



వాజేడు: అక్టోబర్ 1 భద్రాద్రి న్యూస్ : తహసీల్దార్ కార్యాలయం, వాజేడు నందు సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన కే.శే. శ్రీ ఎంజా సమ్మయ్య గారి దశదిన కార్యక్రమం సందర్భంగా సహచర ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంజా సమ్మయ్య గారు ప్రభుత్వ ఉద్యోగిగా అందించిన సేవలను, సహచర ఉద్యోగులతో ఆయనకు ఉన్న సత్సంబంధాలను స్మరించుకున్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ం=జూూా) జిల్లా అధ్యక్షులు, వెంకటాపురం నాయబ్ తహసీల్దార్ శ్రీ ఎం. మహేందర్, వాజేడు నాయబ్ తహసీల్దార్ శ్రీ రామ్‌సింగ్, ఆర్ఐ శ్రీ కుమారస్వామి, శ్రీ కుందమల్ల నాగరాజు, జూనియర్ అసిస్టెంట్, ూూాల జిల్లా అధ్యక్షులు శ్రీ సప్కా సర్వేశ్వరరావు, శ్రీ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోండి

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మేడా మోహన్ రావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం పట్టభద్రులారా వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు చండ్రుగొండ మండలంలో ఉన్న పట్టభద్రులారా మీ ఓటు హక్కును నమోదు చేసుకోండి మీ ఓటు మీ భవిష్యత్తు విద్యావంతుల శక్తి సమాజానికి పురోగతి ప్రజాస్వామ్య బలం చండ్రుగొండ మండలంలో ఉన్న పట్టభద్రులందరూ మీ ఓటు నమోదు చేసుకోండి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోండి అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఫారం 18 ద్వారా మీ యొక్క ఓటును నమోదు చేసుకున్న గలరు బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు మేడా మోహన్ రావు

కొత్తగూడెం క్లబ్బులో ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 01 (భద్రాద్రి న్యూస్) : వృద్ధుల సంక్షేమం, వారి హక్కులు, సమాజంలో వారి ప్రాధాన్యతను గుర్తుచేస్తూ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 1న కొత్తగూడెం క్లబ్‌లో మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల పట్ల సమాజం చూపించాల్సిన గౌరవం, వారికి అందించాల్సిన సహకారం, వారి హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై కార్యక్రమంలో ప్రాధాన్యతగా చర్చించారు. వృద్ధులు కుటుంబానికి, సమాజానికి అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ వారి అనుభవాలు, సూచనలు భవిష్యత్ తరాలకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులను ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి వారికి గౌరవాన్ని తెలియజేశారు. వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయత, బాధ్యత ప్రతి ఒక్కరిలో పెంపొందించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. వృద్ధుల ఆరోగ్యం, భద్రత, సామాజిక భద్రతతో పాటు వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా అవసరమైన సహకారం అందించడం కుటుంబ సభ్యులు, ప్రజలు మరియు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా వృద్ధుల సమస్యలు, హక్కులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు వృద్ధులను సమాజంలో మరింత గౌరవప్రదంగా భాగస్వాములను చేయాలనే సందేశాన్ని అందించారు.

సేవా రంగంలో విశేష కృషి..

- గూడెల్లి యాకయ్యకు ఘన సన్మానం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 01 (భద్రాద్రి న్యూస్) : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాతా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, జాతీయ సేవారత్న అవార్డు గ్రహీత గూడెల్లి యాకయ్యను ఘనంగా సన్మానించారు. గత 20 సంవత్సరాలుగా వివిధ సేవా రంగాల్లో, ముఖ్యంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం ఆయన అందిస్తున్న విశేష సేవలను గుర్తించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన చేతుల మీదుగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెల్లి యాకయ్య మాట్లాడుతూ.,. సమాజంలో నిరాదరణకు గురైన వయోవృద్ధులకు అండగా నిలిచి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడమే తన లక్ష్యమని తెలిపారు. సన్మానాలు, పురస్కారాలు తన బాధ్యతను మరింత పెంచుతాయని, భవిష్యత్‌లో మరింత అంకితభావంతో సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. వయో వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం అందించడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ వితరణ చేసిన బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు



పినపాక, అక్టోబర్ 01
భద్రాద్రి న్యూస్):పినపాక మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బొమ్మరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల మహిళా అధ్యక్షురాలు తాటి సుచరిత ఆధ్వర్యంలో ఫ్యాన్ వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వార్డు మెంబర్లు కనితి శ్రీవిద్య, సనపాల చరం రాణి, సీతారాంపురం గ్రామ పంచాయతీ మహిళా నాయకులు కనితి విజయలక్ష్మి, సిలకల నాగలక్ష్మి, వాడా అనసూయ, దుర్గం విజయశాంతి,ముఖ్య నాయకులు చూడ శాంతారావు, ప్రసాద్, కనితి శ్రీను, బోడపాటి మణికంఠ, దుర్గం వెంకటేష్, సల్లూరు నరసింహారావు, కొమరం సత్యం, కోసం సత్యవతి పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులు

- ప్రభుత్వం అందించిన దుస్తులు, బూట్లు, సాక్సులు, బెల్టుల పంపిణీ.. విద్యార్థులకు ఉపయోగకరంగా ప్రభుత్వ సాయం



వాజేడు, అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్): వాజేడు మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత ఎా ం.్ శా ల లలో విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన ఏకరూప దుస్తులు, బూట్లు, సాక్సులు, బెల్టులను గురువారం పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఏపీవోతో పాటు గ్రామ పెద్దల చేతుల మీదుగా విద్యార్థులకు ప్రభుత్వ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యపై మరింత శ్రద్ధ పెట్టాలని గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని వారికి చేరవేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి దశదిన కార్యక్రమానికి హాజరైన నాయకులు

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సీపీఐ నాయకులు



కారేపల్లి,(భద్రాద్రి న్యూస్ రాములు): సింగరేణి మండలం భాగ్యనగర్ తండ గ్రామపంచాయతీకి చెందిన సీపీఐ నాయకుడు గుగులోత్ చందా నాయక్ (ధరసింగ్) దశదిన కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చందా నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ తండ సర్పంచ్ హీరోలాల్, సింగరేణి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, దండి సురేష్, జిల్లా కార్యదర్శి, జాతీయ సమితి సభ్యుడు ఎర్రబాబు, ఏపూరి లతాదేవి, జిల్లా మహిళా మండలి కార్యదర్శి పోర్టు కళావతి, తాటి నిర్మల, పుచ్చకాయల శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి, రాయల రామారావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- కారేపల్లిలో సేవాలాల్ విజ్ఞాన కేంద్రం, 50 పడకల ఆసుపత్రి నిర్మించాలి

- అక్టోబర్ 10, 11న గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు.. జయప్రదం చేయాలని పిలుపు

కారేపల్లి, అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు): గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం కోరారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు తండాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. కారేపల్లి మండల కేంద్రంలో గురువారం తెలంగాణ గిరిజన సంఘం మండల మహాసభ నిర్వహించారు. అజ్మీరా శోభన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు జిల్లా అధ్యక్షుడు బానోత్ బాలాజీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూక్య వీరభద్రం మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. కారేపల్లి మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నిర్మించి గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో ఎకరం స్థలం కేటాయించి సేవాలాల్ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడు సాగు చేస్తున్న గిరిజన రైతులందరికీ హక్కు పత్రాలు అందించాలని, చదువుకున్న గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గిరిజన తండాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని అన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.



రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు భూక్య వీరభద్రం తెలిపారు. గిరిజనులు, సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా మారావు, సీఐటీయూ మండల కన్వీనర్ కే. నరేంద్ర, సంఘం నాయకులు బానోత్ బన్సీలాల్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ నాయక్, వాంకుడోత్ రాందాస్ నాయక్, భూక్య రమేష్, తోపియా నాయక్, మాలోత్ బాలునాయక్, బానోత్ శ్రీనివాస్ నాయక్, ధరావత్ వినోద్ నాయక్, భూక్య రాంబాబు, ధరావత్ రవికుమార్, బానోత్ వెంకటేశ్వర్లు, అజ్మీర రామదాసు, మాలోత్ శ్రీను, వాంకుడోత్ బాబురావు, రవి నాయక్, వాంకుడోత్ ధరసింగ్, నూనావత్ వెంకన్న, కిషన్, భూక్య రాజేష్, బానోత్ రాజేష్, బానోత్ బాలా తదితరులు పాల్గొన్నారు.

దేవని సతీష్ మాదిగ కి గవర్నర్ కోటలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

- తెలంగాణ చర్మకారుల రాష్ట్ర సంఘాల జేఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ మాదిగ

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 01 (భద్రాద్రి న్యూస్) : అనగా ది : 01/10/2026 రోజున ఉదయం 10 గంటలకు భద్రాది కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నందుగల ఎమ్మార్పీఎస్ కార్యాలయం నందు దాసరి శ్రీనివాస్ 50 డివిజన్ కార్పొరేటర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ చర్మకారుల రాష్ట్ర సంఘాల జేఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ... 1995 నుండి కృష్ణ మాదిగ తో పాటు ఎమ్మార్పీఎస్ ఫౌండర్ గా ఉమ్మడి రాష్ట్రంలో అలుపెరుగని సామాజిక పోరాటాలు చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ 2001 నుండి 2014 వరకు తెలంగాణ సాధనలో తెలంగాణ సాధించేవరకు అలుపెరుగని పోరాటం చేసి 2023 కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం 3 పార్లమెంట్ ఎసి స్థానాలు గెలిపించడంలో కీలక పాత్ర పోషించడంతోపాటుగా, జహీరాబాద్ ఎంపీ సురేష్ హెక్టార్ గారి గెలుపు కొరకు ఉమ్మడి రాష్ట్రంలో మాజీ మంత్రి అయిన ఏ.చంద్రశేఖర రావు గారి ద్వారా చర్మకారుల సంఘాల ఆధ్వర్యంలో జహీరాబాద్ లో బూట్ పాలిష్ వంటి కార్యక్రమాలు చేసి జహీరాబాద్ పార్లమెంటు స్థానాన్ని గెలిపించడంలో కీలక పాత్ర పోషించి నేడు తెలంగాణ రాష్ట్రాన్ని కొల్లగొట్టిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఫామ్ హౌస్ పై మాదిగ డప్పులతో వేలాదిమందితో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా కార్యక్రమాలు చేసి నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరియు ముఖ్యమంత్రికి దళిత ప్రజా ప్రతినిధులను ఎప్పటికప్పుడు అండదండలుగా ఉంటూ ఎవరు వచ్చినా సరే ముందుండి కొట్లాడే శక్తి అయినటువంటి దేవుని సతీష్ మాదిగకే ఎమ్మెల్సీ కేటాయించాలి అని యావత్ తెలంగాణ వ్యాప్తంగా చర్మకారుల సంఘాలు మరియు మాదిగ మాదిగ ఉపకులాల సంఘాలు మాల మరియు మాల ఉపకులాల సంఘాల మద్దతుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలియపరచడం జరిగింది. ఎమ్మార్పీఎస్ ఫౌండర్ అయినటువంటి మందకృష్ణ మాదిగ గారిని బిజెపి అక్కున చేర్చుకొని గౌరవప్రదమైనటువంటి పద్మశ్రీ అవార్డుని ఇవ్వడం జరిగింది. ప్రజా ప్రభుత్వంలో 80% షెడ్యూల్ ప్రజానీకం ఉన్నటువంటి సామాజిక వర్గానికి చెందిన దేవని సతీష్ మాదిగ కి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఇవ్వాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలేటి వెంకటేశ్వరరావు, దాసరి సారధి, అనుముల వీరయ్య, వలస సీతారాములు, దాసరి లక్ష్మీ, కూసపాటి నర్సింగ్, కూసపాటి పవణ్, ప్రభు, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





మండలంలో మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పర్యటన

- పలు కుటుంబాలకు పరామర్శ.. భరోసా

కారేపల్లి, అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు): మండలంలో మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను పరామర్శించి, వారికి భరోసా కల్పించారు. విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు వల్లభనేని గురువయ్య, భాగ్యనగర్ తండాకు చెందిన సీపీఐ నాయకులు గుగులోతు ధారాసింగ్ (చందా) దశదినకర్మ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, సర్పంచులు భూక్య లక్ష్మణ్, వార్డు సభ్యులు భూక్య కిషన్, గుగులోతు నాగేశ్వరరావు, నాయకులు అజ్మీరా వీరన్న, వాంకుడోత్ నరేష్, భూక్య రాంకిషోర్, మాజీ ఎంపీపీ జర్పుల లక్ష్మణ్, భూక్య రాజేష్, గుగులోతు హారు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ వైస్ ఎంపీపీ పుట్టినరోజు వేడుకలు



భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 1: మాజీ వైస్ ఎంపీపీ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ దారా మల్లికార్జునరావుకు ప్రజా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా ప్రెస్ క్లబ్ చైర్మన్ దస్తగీర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దారా మల్లికార్జునరావును శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన మరింతగా ముందుకు సాగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం దారా మల్లికార్జునరావుకు క్లబ్ సభ్యులు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తగూడెం కలెక్టర్ ఆఫీసులో ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

- రిటైర్డు ప్రోఫెషర్ జముల్లముడి అబ్రహాము ను ఘనంగా సత్కరించిన కలెక్టర్ ఆఫీసు గెజిటెడ్ ఉద్యోగులు



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 01 (భద్రాద్రి న్యూస్) : వృద్ధుల సంక్షేమం, వారి హక్కులు, సమాజంలో వారి ప్రాధాన్యతను గుర్తుచేస్తూ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయములో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల పట్ల సమాజం చూపించాల్సిన గౌరవం, వారికి అందించాల్సిన సహకారం, వారి హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై కార్యక్రమంలో ప్రాధాన్యతగా చర్చించారు. వృద్ధులు కుటుంబానికి, సమాజానికి అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ వారి అనుభవాలు, సూచనలు భవిష్యత్ తరాలకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆఫీసు గెజిటెడ్ ఉద్యోగులు జిల్లాలో గత 30 సంవత్సరాలుగా వివిధ సేవా రంగాల్లో, సంక్షేమం కోసం పాటుపడిన రిటైర్డు ప్రోఫెషర్ జముల్లముడి అబ్రహాము అందిస్తున్న విశేష సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించి, శాలువా కప్పి, మెమెంటో అందజేసి గౌరవాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులను ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి వారికి గౌరవాన్ని తెలియజేశారు. వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయత, బాధ్యత ప్రతి ఒక్కరిలో పెంపొందించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. వృద్ధుల ఆరోగ్యం, భద్రత, సామాజిక భద్రతతో పాటు వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా అవసరమైన సహకారం అందించడం కుటుంబ సభ్యులు, ప్రజలు మరియు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా వృద్ధుల సమస్యలు, హక్కులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు వృద్ధులను సమాజంలో మరింత గౌరవప్రదంగా భాగస్వాములను చేయాలనే సందేశాన్ని అందించారు.

వ్యభిచార గృహం పై పోలీసుల దాడి

పాల్వంచ, అక్టోబర్ 01 (భద్రాద్రి న్యూస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని దమ్మపేట సెంటర్ త్రివేణి స్కూల్ సమీపంలో గురువారం ఓ గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ ఎస్సై టీ నాగరాజు ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. దాడి నిర్వహించగా పట్టుబడిన వారిలో ఇద్దరు ఆర్గనైజర్లు మేడిపల్లి సంధ్య అలియాస్ ప్రశాంతి, చిన్నపాటి బేబీ శ్యామల అలియాస్ అనూష వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు వారితోపాటు నలుగురు మహిళలు, ఇద్దరు విటులు, వారి వద్ద నుండి రెండు వేల రూపాయలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఇసుక కొరత గురుంచి పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుతో మాట్లాడిన ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు



గుండాల అక్టోబర్ 1 భద్రాద్రి న్యూస్ : ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పెద్దమ్మతల్లి దర్శనార్థం విచ్చేసిన పినపాక శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు గారిని మర్యాద పూర్వకంగా కలిసిన గుండాల మండల ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు. ఈ సందర్భంగా వారు మండలంలో ఇందిరమ్మ ఇండ్లుల గురుంచి కానీ, ప్రభుత్వ భవనాల నిర్మాణం గురుంచి కానీ ఇసుక తొలకాలు చేస్తున్న క్రమంలో ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది కి గురి చేస్తున్నారని ఇందువలన పేద ప్రజలు ఇండ్లు కట్టుకోవడానికి ఇబంది పలు అవుతున్నారని తద్వారా ట్రాక్టర్స్ తొలకాలపై ఆధారపడిన మాలాంటి చాలా మంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలియజేయడం జరిగింది. సమస్యను విన్న శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారు సానుకూలంగా స్పందించి వెంటనే ఇఖీా గారికి చరవాణి ద్వారా మాట్లాడి ఇసుక తోలకాలలో ట్రాక్టర్స్ యజమానులను ఇబ్బంది పెట్టొద్దని, పేద ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఆగిపోయాయి అని ఎట్టి పరిస్థితి ల్లో ఇసుక తోలకాలను ఆపకూడదని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ట్రాక్టర్ యూనియన్ నాయకులు రాఖ అబ్దుల్ నభి, రాఖ కాసీం, రాఖ సాభీర్, గడ్డం రమేష్, గడ్డం పాపాయ్య , వాగబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

-- షేక్ షబ్బీర్



కారేపల్లి, అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్ రాములు): వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ షబ్బీర్ కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఫారం--18 ద్వారా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి, నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని షేక్ షబ్బీర్ పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

- ఫారం--18 ద్వారా నమోదు చేసుకోవాలని షేక్ గౌసిద్దీన్



కారేపల్లి, (భద్రాద్రి న్యూస్ రాములు): పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత ఉన్న పట్టభద్రులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఎన్నికల సంఘం సూచించిన ఫారం--18 ద్వారా తమ పేర్లను సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పట్టభద్రుల నియోజకవర్గంలో నమోదు కోసం నిర్దేశిత అర్హతలు కలిగి ఉండటంతో పాటు, సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులుగా ఉండాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. దరఖాస్తు సమయంలో పేరు, చిరునామా, విద్యార్హత తదితర వివరాలను స్పష్టంగా నమోదు చేసి, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు పంపించే ముందు నమోదు చేసిన వివరాలను మరోసారి పరిశీలించుకోవాలని సూచించారు. దరఖాస్తు పూర్తయిన అనంతరం అందే గుర్తింపు సంఖ్యను భద్రపరుచుకుని, దరఖాస్తు పరిస్థితిని పరిశీలించుకోవాలని కోరారు. పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా అర్హులైన పట్టభద్రులు శాసనమండలి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని షేక్ గౌస్ ఉద్దీన్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

అనాథ వృద్ధులకు అమ్మలా మదర్ థెరిసా సేవా సంస్థ



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 01 (భద్రాద్రి న్యూస్) : వృద్ధాప్యంలో ఆదరణ కోల్పోయిన వారికి అండగా నిలవడం, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడడమే నిజమైన మానవత్వమని చాటుతూ రుద్రంపూర్‌లో మదర్ థెరిసా సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథలు, ఆదరణకు నోచుకోని వృద్ధులను చేరదీసి వారికి ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మదర్ థెరిసా సేవా సంస్థ అధ్యక్షుల ఆధ్వర్యంలో వృద్ధులకు క్షవరం, కటింగ్ చేయించి, శుభ్రంగా స్నానం చేయించారు. అనంతరం వారికి నూతన వస్త్రాలను అందించి, స్వయంగా ధరింపజేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వృద్ధాప్యంలో శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి చిన్నపాటి సహాయం కూడా ఎంతో విలువైనదని నిర్వాహకులు పేర్కొన్నారు. కుటుంబాలకు దూరమై ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు ఆప్యాయత, ప్రేమ, ఆదరణ కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృద్ధుల అనుభవాలు, జీవిత పాఠాలు నేటి తరానికి ఎంతో విలువైనవని తెలిపారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వారికి అవసరమైన సమయంలో సహాయం అందించాలని, వృద్ధులను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా మానవత్వం, సేవాభావం చాటుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

గుండాల EMRS లో డ్రగ్స్, క్రమశిక్షణ, విద్య, వంటి విషయాల్లో అవగాహన కల్పించిన గుండాల CI తిరుపతి SI శ్రావణ్ కుమార్



గుండాల అక్టోబర్ 1 భద్రాద్రి న్యూస్: గుండాల లోని EMRS లో విద్యార్థుల తో అవగాహన సభ లో స్థానిక CI తిరుపతిమరియు SI శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. విద్యార్థుల తో వారు మాట్లాడుతూ, పాఠశాల లో క్రమశిక్షణ, సోదరభావం, గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల ఇతర విషయాల్లో కాకుండా విద్య పై దృష్టి పెట్టాలని, గొడవల్లో తల దూర్చవద్దని. సిగరెట్, గుట్కా, మద్యం, మాదక ద్రవ్యాలు వంటి వాటి జోలికి వెళ్ళొద్దని. అవి తమ భవిషత్తు ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. టీచర్స్ కూడా లోకల్ కట్టుబాట్లకు అనుగుణం గా నడుచుకోవాలని, లోకల్ వాళ్ళతో సన్నిహితంగా మెలగాలని సూచించారు.

సాక్ష్యం యాప్‌తో మహిళా సంఘాల్లో పారదర్శకత పెంచాలి

- వెలుగు ఏపీఎం వెంకట రామారావు

- సాతానిగూడెంలో 'సాక్ష్యం' యాప్‌పై మహిళా సంఘాలకు అవగాహన సదస్సు

కామేపల్లి,అక్టోబర్ 1(భద్రాద్రిన్యూస్):-
మహిళా స్వశక్తి సంఘాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యంగా సెర్ప్ 'సాక్ష్యం' యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని మండల వెలుగు ఏపీఎం ఎం. వెంకట రామారావు తెలిపారు. కామేపల్లి మండలం పరిధిలోని సాతానిగూడెం గ్రామంలోని శ్రీ లక్ష్మీ గ్రామ సమాఖ్య పరిధిలో గురువారం మహిళా సంఘాల సభ్యులకు'సాక్ష్యం' యాప్ వినియోగం, సంఘ సమావేశాల నిర్వహణ,డిజిటల్ విధానం వల్ల కలిగే ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ?సంఘాల ప్రతి సమావేశం వివరాలు,సభ్యుల హాజరు,తీసుకున్న ముఖ్య నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు సాక్ష్యం యాప్‌లో డిజిటల్ రూపంలో



నమోదు చేయాలని మండల అధికారి వెలుగు ఏపిఎం సూచించారు. దీనివల్ల పర్యవేక్షణ సులభతరమవ్వడమే కాకుండా సంఘాల నిర్వహణ మరింత క్రమబద్ధంగా మారుతుందన్నారు. సీఆర్‌పీ ఆదూరి సత్యవతి మాట్లాడుతూ మహిళలు పొదుపు అలవాటును పెంచుకోవాలని, అంతర్గత రుణాలను సమయానికి చెల్లిస్తూ ప్రభుత్వం అందించే జీవనోపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గ్రామ



సమాఖ్య అధ్యక్షురాలు దొంగల జ్యోతి, కార్యదర్శి మామిడాల కుమారి, కోశాధికారి దొంగల సరస్వతి, వివోఏ కళ్యాణిలతో పాటు గ్రూపు సభ్యులు అంజలి, బాలమిత్ర,స్వప్న, సౌజన్య,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' పనుల పరిశీలన

- మండల పరిషత్ అభివృద్ధి అధికారి సోమలాల్

- ఉపాధి హామీ ఎపిఓ శ్రీ రాణి గ్రామ సర్పంచ్ లుసి

కామేపల్లి,అక్టోబరు 1(భద్రాద్రిన్యూస్):
మండలంలోని ముచ్చర్ల గ్రామంలో 'వి.బి.జి.రామ్‌జీ' (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ) పథకం కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. స్థానిక రామస్వామిగుట్ట చుట్టూ కొండ ప్రాంత రక్షణ.నీటి నిల్వ కోసం తవ్వుతున్న కందకాల పనులను ఎంపీడీఓ ధరావత్ సోంలాల్, ఏపీఓ అద్దంకి శ్రీరాణి, గ్రామ సర్పంచ్ లుసి ప్రత్యక్షంగా తనిఖీ చేసి,సిబ్బందికి పలు సూచనలు చేశారు.
?ఈ సందర్భంగా ఎంపీడీఓ ధరావత్ సోంలాల్ మాట్లాడుతూ..



గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని తెలిపారు.ప్రతి ఒక్క కూలీకి పని కల్పించడంతో పాటు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పనుల వేగాన్ని పెంచాలని, రోజువారీ లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం ఏపీఓ అద్దంకి శ్రీరాణి మాట్లాడుతూ గ్రామంలోని కూలీలందరూ ఉపాధి హామీ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, నిబంధనల ప్రకారం కనీస రోజువారీ వేతనం అందేలా కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కోరారు. రామస్వామిగుట్ట పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న కందకాల తవ్వకం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ,ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) మంజుల,వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది. గ్రామ ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తలింగాలలో ప్రభుత్వ భూమిని అక్రమించిన వారిపై రెవెన్యూ అధికారుల వేటు

- అక్టోబర్10లోగా నిర్మించిన షెడ్లు తొలగించాలని

- 43 మందికి తహశీల్దార్ నోటీసులు జారీ ?

కామేపల్లి,అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్):-
మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామ లోప్రభుత్వ భూమిని అక్రమంగా నిర్మించి న ఇండ్ల షెడ్లను వెంటనే తొలగించాలని కామేపల్లి తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది వారు గురువారం నోటీసులు జారీ చేసింది. ? మండల తాసిల్దార్ కార్యాలయ అధికారుల సమాచారం ప్రకారం. కొత్తలింగాల గ్రామంలోని సర్వే నంబర్లు 120, 125, 126 పరిధిలోని ప్రభుత్వ భూమిలో 43 మంది వ్యక్తులు ఒక్కొక్కరు 384 చదరపు అడుగుల చొప్పున ఆక్రమించి అక్రమంగా ఇండ్ల షెడ్లు నిర్మించినట్లు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించింది.ఈ మేరకు 1905 మద్రాసు ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 7 కింద ఆక్రమణదారులకు ఆర్.సి.నెం: డీ/296/2026 ద్వారా అధికారిక నోటీసులు 43 మందికి అందజేశారు. ?ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించ కూడదో సంబంధిత వ్యక్తులు తగిన వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో అక్టోబర్ 10వ తేదీలోపు సదరు ఆక్రమణలను స్వయంగా తొలగించుకోవాలని నోటీసులో స్పష్టం చేశారు.నిర్దేశిత గడువులోగా స్పందించకుంటే రెవెన్యూ చట్టాల ప్రకారం అక్రమ నిర్మాణాలను తొలగించి,భూమిని స్వాధీనం చేసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. ?నోటీసుల,జారీ చేశారు ఈ కార్యక్రమంలో కొత్తలింగాల రెవిన్యూ



జిపిఓ సుజాత,పొన్నేకల్ రెవిన్యూ జిపిఓ బోలేషా,గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మండల కేంద్రం పిహెచ్‌సిలో ఆత్మీయ సన్మాన సభ

కామేపల్లి,అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్):- తమ్ము చేసే సేవే పరమావధిగా పనిచేసి,ప్రజా ఆరోగ్యపట్ల రోగుల గుండెల్లో చోటు సంపాదించుకున్న ఉద్యోగులకు కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తోటి సిబ్బందిలు ఘనంగా వీడ్కోలు పలికారు.ఇటీవల పదోన్నతులు, సాధారణ బదిలీలపై వెళ్తున్న వైద్యులు, నర్సులు,ఇతర ఉద్యోగులకు గురువారం ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఆసుపత్రి రూపురేఖలు మార్చడంలో, బాధితులకు నాణ్యమైన వైద్యమందించడంలో వీరు అందించిన సేవలను సహచరులు గుర్తుచేసుకున్నారు. బదిలీపై వెళ్తున్న సిబ్బందికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
సన్మానం పొందిన ఉద్యోగులు:
కె. వెంకటేశ్వర్లు (సముదాయ ఆరోగ్య అధికారి)
కృష్ణ (జిల్లా ప్రాజెక్ట్ నిర్వహణ అధికారి)
పుష్పలత (పరిచారికాధికారి)
అనురాధ (ఉన్నత శ్రేణి సహాయకురాలు)
వి. అరుణ (సహాయక ప్రసవ పరిచారకురాలు)
టి. తులసి (సహాయక ప్రసవ పరిచారకురాలు)
కృష్ణారావు (ఔషధ నిపుణులు) ఈ ఆత్మీయ వీడ్కోలు వేడుకలో వైద్యులు డాక్టర్ శ్రీదేవి,డాక్టర్ సుదీప్, ఆరోగ్య అధికారులు



వెంకటలక్ష్మి, స్వర్ణమార్త,నేత్ర వైద్య అధికారి సుబ్బలక్ష్మి, పర్యవేక్షకులు రాధాకృష్ణ, నరేందర్,లక్ష్మితో పాటు స్థానిక ఆరోగ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

సంద్ర వెంకటయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరవలేనివి

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

కామేపల్లి,అక్టోబర్ 1 (భద్రాద్రిన్యూస్): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి సీనియర్ నాయకుడు సంద్ర వెంకటయ్య అందించిన సేవలు మరువలేనివి, ఆయన మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, మండల నాయకులు అన్నారు.సాతాని గూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంద్ర వెంకటయ్య దశదినకర్మ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
?అనంతరం నాయకులు మాట్లాడుతూ. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, అంకితభావంతో పనిచేసిన నాయకుడు వెంకటయ్య అని కొనియాడారు. ఆయన ఆకస్మిక మరణం కుటుంబానికే కాకుండా కాంగ్రెస్ పార్టీకి కూడా పెద్ద దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. వెంకటయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇస్తూ కుటుంబ సభ్యులకు తీవ్ర సానుభూతి తెలిపారు.
?ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోతు భావ్ సింగ్,మండల యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దొడ్ల వేణు,మాజీ సర్పంచ్ అజ్మీర రాందాస్, ఆర్కె పురం సర్పంచ్ అజ్మీర చిన్న, నాయకులు వల్లమోతు వెంకట నరసయ్య,యూత్ కాంగ్రెస్ నాయకులు అజ్మీర శివ,మాజీ సర్పంచ్ ధరావత్ బాలు పాల్గొన్నారు. అలాగే సాతానిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు బాధావత్ బాబు నాయక్,కామేపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య



సీతారాములు, మండల మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇమామ్, సాతానుగూడెం గ్రామ నాయకులు కన్నెబోయిన శ్రీను, జక్కంపూడి శ్రీను, జత్తుల నాగరాజు, కుమార్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు

ఇంటిపై సోలార్ విద్యుత్ బిల్లుకు చెక్- కేంద్రం సబ్సిడీ

– ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి బ్రోచర ఆవిష్కరించిన డాక్టర్ కాపా చంద్రకళ

వైరా, అక్టోబర్ 2,(భద్రాద్రి న్యూస్): వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం ప్రధానమంత్రి సూర్య ఘర్ ముస్ట్ బిజిలి బ్రోచర్ ను డాక్టర్ కాపా చంద్రకళ ఆవిష్కరించారు. ఈ సబ్సిడీ పథకం ద్వారా అందే సోలార్ సిస్టం సబ్సిడీ వివరాలను వివరించారు. పీఎం సూర్య ఘర్ ముస్తు బిజిలి యువజన పథకం కింద ఇంటిపై సోలార్ ప్యానల్స్ పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని రూ 78000 వరకు సబ్సిడీ పొందవచ్చు అని చంద్రకళ తెలిపారు. మూడు యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చునని ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రభుత్వానికి అమ్మవచ్చునని గ్రూప్ హౌసింగ్ సొసైటీలో కూడా ఈ సబ్సిడీ వర్తిస్తుందని, ఎలక్ట్రానిక్ వాహనాలు చార్జింగ్ లాంటివి ఏర్పాటు చేసుకోవచ్చు అని, ఒకసారి సోలార్ ప్యానల్స్ పెట్టుకుంటే 25 వేల వరకు విద్యుత్తును పొందవచ్చునని ఆమె తెలిపారు. దీనివలన కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా సంవత్సరంలో 75 వేల కోట్ల ఆదాముతుందని ప్రభుత్వం అంచనాగా ఉందని తెలిపారు. గృహ యజమానులు ఇంటి కప్పు పైనే సోలార్ ప్యానల్స్ ను ఏర్పాటు చేసుకొని ఇంటికి సరిపడా విద్యుత్తును వాడుకోవచ్చునని ఆమె తెలిపారు. ప్రజలు పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని అర్హతను వారు సవరి విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకొని విద్యుత్తును ఆరా చేసుకోవాలని సవరి శక్తి వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణ కూడా ఈ తోడ్పాటు ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్



చింతనిపు సులోచన, విద్యుత్ శాఖ అధికారులు,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

మల్కారం గ్రామానికి చెందిన విద్యార్థికి గోల్డ్ మెడల్ వైద్య విద్యలో బిఎండి జనరల్ మెడిసిన్ లో ఎంపికైన సాయి వినీల



భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 1 : దమ్మపేట మండలం మల్కారం గ్రామానికి చెందిన సాయి వినీల వైద్య విద్యలో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఎండీ జనరల్ మెడిసిన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సాయి వినీల గోల్డ్ మెడల్ అందుకునేందుకు ఎంపికయ్యారు. రాష్ట్రపతి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకునే అవకాశం దక్కడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చదువుపై పట్టుదల, క్రమశిక్షణతో సాయి వినీల ఉన్నత లక్ష్యాన్ని సాధించారని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్య విద్యలో ప్రతిభ కనబరిచి ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేయడం పట్ల గ్రామస్థులు అభినందనలు తెలిపారు. సాయి వినీల సాధించిన విజయం యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సాయి వినీల నిరూపించారని తెలిపారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి– రాంబాబు, దమ్మపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అధ్యక్షులు కక్కిరాల రమేష్, మండల సీనియర్ నాయకులు చిన్నంశెట్టి యుగంధర్, మున్నూరు కాపు సంఘం నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాముల ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ బుద్దే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి వేడుకలకు కాంగ్రెస్ శ్రేణులు.ప్రజలు భారీగా తరలిరావాలి

- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజర్లపూడి రాంబాబు పిలుపు



కామేపల్లి,అక్టోబర్ 1 (భద్రాద్రి న్యూస్):
మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2న (శుక్రవారం) ఉదయం 9:30 గంటలకు మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ సెంటర్‌లో నిర్వహించే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కామేపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుజర్లపూడి రాంబాబు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం,అహింసల మార్గంలో నడిచి దేశానికి స్వాతంత్ర్యం కోసం తన త్యాగాన్ని సిద్ధించి తెచ్చిపెట్టిన మహానుభావుడు మన జాతిపిత ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. కామేపల్లి మండల కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)కార్యవర్గ సభ్యులు,మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు,ఉప సర్పంచులు, డైరెక్టర్లు,వివిధ గ్రామాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు కోరారు

సాయం చిన్నది.. చేయూత గొప్పది!

- మనం చేసే సహాయం.. మరెందరికో స్ఫూర్తి కావాలి

- గరికపాడు ఉచిత వైద్య శిబిరంలో

గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య





వైరా, అక్టోబర్ 2,(భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ మండల పరిధి గరికపాడు గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం ప్రాథమిక పాఠశాలలో నేనున్నా మహిళా మండలి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మేరుగు మానసతో సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని, పిల్లలకు స్కూల్ బ్యాగులు అంగనవాడి కేంద్రాలకు ఫ్యాన్లు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ లక్కిరెడ్డి నాగలక్ష్మి ప్రభాకర్ రెడ్డి, మండల వైద్యాధికారి శ్రీహర్ష సమక్షంలో నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కోట పుల్లయ్య మాట్లాడుతూ..వైద్యమనేది ఖర్చుతో కూడుకున్నది. మానవతా దృక్పథంతో ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రాథమిక వైద్య సేవలు అందించడంతో సమాజానికి కొంత భరోసా కల్పించిన వాళ్ళమవుతామని అన్నారు. సేవ చేయడం అంటే పెద్ద మొత్తంలో ఖర్చు చేయడమని కాదు, అవసరమైన వారికి చేతనైనంత చేయూతను అందించడమే నిజమైన సేవాభావమని అన్నారు.ఒక చిన్న సహాయంతో మరో కుటుంబానికి ధైర్యాన్నివ్వగలదని అన్నారు. సేవా కార్యక్రమాలతో సమాజంలో మానవత్వాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ప్రజలకి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ట్రస్టు ముందుంటుందని పరిస్థితి అదుపుతప్పితే అవసరమైతే దాతల సహకారంతో వైద్య సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చిన్నతనం నుండే పిల్లలకు సేవ భావాన్ని అలవరిస్తే భవిష్యత్తులో అవినీతికి అడ్డుకట్ట వేయొచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ సురేష్ బాబు వార్డు మెంబర్లు లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మేరుగు శ్రీమాన్,ఆర్ బి ఎస్ కే డాక్టర్ నిమ్మతోట శిరీష దీప్తిక, ఏఎన్ఎం జె జ్యోతి, ఫార్మసీ ఆఫీసర్ పి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ సరస్వతి, బి కిషన్, తేళ్లూరి శారద, సొసైటీ డైరెక్టర్ మేరుగు రత్నరాజు, ఎమ్ ఎల్ హెచ్ పి ఆకారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.